పాలన చేతగాకనే అక్రమ అరెస్టులు

- నరేందర్‌రెడ్డిని, రైతులను విడుదల చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 14: పాలన చేతగాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల కోసం పోరాడుతున్న వారిని అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ విమర్శించారు. ఈ మేరకు గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది పాలనకు ముందే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడుతున్నారని అన్నారు. తన సొంత నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డిపై రైతులు తిరుగుబాటుకు ఎగురవేశారన్నారు. రైతులు తమ భూముల కోసం పోరాటం చేస్తే మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా తీవ్రవాదిని అరెస్ట్ చేసిన విధంగా అదుపులోకి తీసుకోవడం సరైన విధానం కాదన్నారు. రేవంత్‌రెడ్డి తన అల్లుడి ఫార్మా కంపెనీ కోసం రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తిరగబడితే బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వెంటనే నరేందర్‌రెడ్డిని, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో కేసీఆర్, కేటీఆర్ పాత్ర కీలకమన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. కొంత మంది నాయకులపై కేసులు పెడితే పార్టీ శ్రేణులు భయపడుతారని అనుకోవడం మూర్ఖత్వమేనన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, కాసర్ల మహేందర్, అనీల్‌గౌడ్, దేవరాజు, మార్గం కార్తికేయ, వెంకటేశ్, నవీన్, సాయి, తదితరులున్నారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేదిలేదు
- కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 14: కాంగ్రెస్ నేతలు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని, వ్యక్తిగత విమర్శలు చేస్తే సరైన గుణపాఠం చెబుతామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు దిడ్డి రాజు, గుండ్లపల్లి పూర్ణచందర్, దార్ల సందీప్ విలేకరులతో మాట్లాడారు. నేత కార్మికుల బలవన్మరణాలపై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఎద్దేవా చేసేలా మాట్లాడడం తమను తీవ్రంగా బాధించిందని వాపోయారు. మహేందర్‌రెడ్డి వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలు ప్రెస్ మీట్ ద్వారా ఖండించారని తెలిపారు. కాగా కాంగ్రెస్ ముఖ్య నాయకులు నేత కార్మికుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను ప్రకటించాల్సింది పోయి బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిగత దాడికి దిగారని ఆరోపించారు. నేత కార్మికుల చావులపై రాజకీయం చేయొద్దని హితవు పలికారు. ప్రతిపక్ష నాయకులుగా ప్రజల సంక్షేమం కోసం సూచనలు చేయడం మా బాధ్యతని పేర్కొన్నారు. నేత కార్మికులు చనిపోతే వ్యక్తిగత కారణాలతో చనిపోయారని వ్యంగ్యంగా మాట్లాడిన మహేందర్‌రెడ్డి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. బతుకమ్మ చీరెల విషయంలో అబద్ధపు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అధికార పార్టీ నాయకులు దమ్ముంటే బహిరంగ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే ప్రజలు విశ్వసించబోరని గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 11నెలల నుంచి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి కోసం కాంగ్రెస్ చేసిందేమిటో చెప్పాలన్నారు. యారన్ డిపో వేములవాడలో ఏర్పాటు చేయడంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు సత్తార్, మున్సిపల్ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

సమావేశంలో ఎస్పీ అఖిల్ మహజన్, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఈ నెల 17,18 తేదీల్లో నిర్వహించే గ్రూప్ -3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఉద్యోగులు, సిబ్బందికి ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ సూచించారు. సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం పరీక్షల నిర్వహణపై అబ్జర్వర్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, చీఫ్ సూపర్‌వైజర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, టీజీ పీఎస్సీ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 17,18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు జిల్లాలో మొత్తం 7062 మంది అభ్యర్థుల్లో మహిళలు 3,359, పురుషులు 3,701, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రూప్-3 పరీక్షల కోసం జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు చంద్రయ్య, శేషాద్రినీ రెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్డీవో, జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో మత్స్య కార్మికులకు ఉపాధి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొదురుపాక వద్ద శ్రీ రాజ రాజేశ్వర జలాశయంలో చేప పిల్లలను వదలి పెడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, నవంబర్ 14: శ్రీరాజరాజేశ్వర జలాశయంలో చేప పిల్లలను వదలిపెట్టి పెంపకం చేయడంతో గ్రామాల్లోని మత్స్య కార్మికులకు ఎంతో ఉపాధి కలుగుతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెప్పారు. గురువారం బోయినపల్లి మండలం కొదురుపాక వద్ద శ్రీ రాజరాజేశ్వర జలాశయంలో 94వేల పైన చేప పిల్లలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులు స్థానిక నాయకులతో కలిసి వదిలిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని కులాల వారికి ఉపాధి కోసం కుల వృత్తులను ప్రోత్సహించేందుకు అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, జిల్లా మత్స్య శాఖాధికారి సౌజన్య, ఎంపీడీవో జయశీల, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు రవీందర్, కాంగ్రెస్ నాయకులు రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్‌యాదవ్, తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బోయినపల్లి మండల పరిషత్ కార్యాలయంలో 152 మంది బాధితులకు రూ.33 లక్షల 44వేల 500 సీఎంఆర్ఎఫ్ సాయం చెక్కులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం అందించారు. ఇక్కడ జడ్పీ సీఈవో వినోద్ కుమార్, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, నవంబర్ 14 : డీఏఎన్ఎస్ (డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నికల్ కోర్స్), డీఈసీజీ (డిప్లొమా ఇన్ ఈసీఈ టెక్నీషియన్ కోర్స్) చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు నవంబర్ 20 లోపు దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో డీఏఎన్ఎస్ కోర్సుకు సంబంధించి 30 సీట్లు, డీఈసీజీ కోర్సుకు 30 సీట్లు ఉన్నాయని, ఇప్పటివరకు రెండు కోర్సులకు కలిపి మొత్తం 57 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కోర్సుల్లో నమోదు చేసుకునేందుకు పారామెడికల్ బోర్డు నవంబర్ 20 వరకు గడువు విధించిందని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ రిమాండ్

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 14: గల్ఫ్ పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. గుండారంకు చెందిన న్యాలపల్లి బ్రహ్మచారిని కరీంనగర్‌కు చెందిన మహ్మద్ మిన్హాజ్ హాంకాంగ్ పంపిస్తానని రూ.1.20లక్షలు తీసుకుని మోసం చేశాడు. దీంతో ఆగస్టు 10న ఠాణాలో ఫిర్యాదు చేయగా మిన్హాజ్‌పై కేసు నమోదు చేశామని అప్పటి నుంచి నిందితుడు తప్పించుకు తిరుగుతున్నాడని ఎస్ఐ తెలిపారు. గురువారం మోసం చేసిన వ్యక్తి సమాచారం తెలుసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ చెప్పారు.

కలెక్టర్‌పై దాడిని నిరసిస్తూ టీఎన్‌జీవోల నిరసన

కలెక్టరేట్, నవంబర్ 14 : వికారాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ప్రభుత్వ సిబ్బందిపై జరిగిన దాడిని నిరసిస్తూ గురువారం ప్రభుత్వ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వోద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, కలెక్టర్, అదనపు కలెక్టర్, సిబ్బందిపై ప్రజలు దాడి చేయడం అత్యంత హేయమైన చర్యన్నారు. ఇక్కడ టీఎన్‌జీవో నాయకులున్నారు.

నరేందర్‌రెడ్డి, రైతులను విడుదల చేయాలి

- బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి

బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహ్మారెడ్డి

ముస్తాబాద్, నవంబర్ 14 : కొడంగల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితోపాటు రైతులను విడుదల చేయాలని, పార్టీ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి తెలిపారు. వారి అరెస్టు చేయడాన్ని ముస్తాబాద్ బీఆర్ఎస్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులపై అక్కడి భూములు కోల్పోతున్న రైతులు ఎదురు తిరిగి దాడులు చేసిన సంఘటనలో అక్కడి రైతులతో పాటు కొడంగల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని ఎలాంటి సమాచారం లేకుండా పోలీసులు ఆగంతకుల్లా వచ్చి బలవంతంగా కారులో ఎత్తుకెళ్లడంసరికాదన్నారు. దీనిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని పేద రైతుల భూములు ఫార్మా విలేజ్‌కు సేకరిస్తే అక్కడి రైతులకు వివరించి వారిని ఓప్పించాల్సింది పోయి, భూములు ఇవ్వమన్న రైతులపై పోలీసు కేసులు పెట్టడమేంటని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గంలో రైతులు చేసిన తిరుగుబాటు రేవంత్ రెడ్డి చేతగాని పాలనకు నిదర్శనమన్నారు. అక్కడి రైతులు అధికారులపై తిరుగబాటుచేస్తే బీఆర్ఎస్ పార్టీపై వేయడం, బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు పార్టీ నేతలను భయభ్రాంతులకు గురి చేయడానికే అక్రమ కేసులు అరెస్టులకు దిగుతుందన్నారు. భయపెట్టాలని చూస్తే ఉద్యమ చరిత్ర నుంచి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ కేసులకు భయపడదని, అది కాంగ్రెస్ నేతల మూర్ఖత్వం అవుతుందన్నారు. నరేందర్ రెడ్డితోపాటు రైతులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గూడూరి భరత్, ముక్క మల్లయ్య నాయకులు పాల్గొన్నారు.

దవాఖానలో ఘనంగా బాలదివాస్

సిరిసిల్లలోని సృజన్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శను ప్రారంభిస్తున్న జిల్లా ప్రత్యేక పాలనాధికారి భీమ్యానాయక్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 14: జిల్లా కేంద్రంలోని సృజన్ పిల్లల దవాఖానలో గురువారం బాలల దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణి ప్రసాద్ రూపొందించిన చిత్రాలతో ఏర్పాటు చేసిన 'చిత్ర ప్రదర్శన'ను జిల్లా ప్రత్యేక పాలనాధికారి భీమ్యానాయక్ ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, డాక్టర్ కందేపి రాణిప్రసాద్ సామాన్య వస్తువులతో అసామాన్యమైన సందేశాన్ని చిన్నారులకు ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు. ఇక్కడ డాక్టర్ కందేపి రాణిప్రసాద్, డాక్టర్ కందేపి ప్రసాద్‌రావు, డాక్టర్ కే స్వాప్నిక, హాస్పిటల్ మేనేజర్ సృజన్, తదితరులున్నారు.

కొనుగోలులో సమస్యలుంటే సమాచారమివ్వండి

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట, నవంబర్ 14: కొనుగోలు కేంద్రంలో ఏమైనా సమస్యలుంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ రైతులకు సూచించారు. గురువారం ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, గంభీరావుపేట మండలంలోని సముద్రలింగాపూర్, గోరంటాల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలులో సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ రామచంద్రం, సీఐ శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

విద్యా వంతులకు ఉన్నత గుర్తింపు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 14: విద్యావంతులకు సమాజంలో ఉన్నతస్థాయి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సినారె గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్పీ హాజరై మాట్లాడుతూ, పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులందరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణగౌడ్, సిరిసిల్ల ఏఎంసీ చైర్మన్ స్వరూపరెడ్డి, చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, గ్రంథపాలకులు శంకరయ్య, కే మల్లయ్య, కే శ్రీనివాస్, మాధవి, కవిత ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కోనరావుపేట, నవంబర్ 14: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. ఇక్కడ చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శివకుమార్ తదితరులున్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

బుర్రవేణి వేణు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 14: బొప్పాపూర్‌కు చెందిన బుర్రవేణి వేణు (27) అప్పుల బాధతో గత శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా మండల కేంద్రంలోని అశ్వినీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి బంధువులు అందించిన వివరాల ప్రకారం, వేణుకు ఏడాది క్రితం వివాహం కాగా అంతకుముందే సోదరి రజిత పెళ్లికి చేసిన అప్పులతోపాటు అతడి పెళ్లికి తెచ్చిన అప్పులున్నాయి. అలాగే అతడి సోదరుడు సతీశ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్‌చేస్తూ తన మిత్రుడికి రూ.3 లక్షలకు వేణును ష్యూరిటీ పెట్టి అప్పు ఇప్పించాడు. కాగా అతడు మోసం చేసి పారిపోయాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సమయంలో భార్యతో చిన్నపాటి గొడవ జరుగగా ఆమె తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన వేణు వారం రోజులక్రితం గడ్డి మందు తాగాడు. తాగిన రెండు రోజులకు గడ్డి మందు తాగినట్లు చెప్పడంతో పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని అశ్విని హాస్పిటల్‌కు వేణును తరలించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలి

- బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 14: చార్ సౌ బీస్ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలు అమలుచేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్‌నాయక్ విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా గిరిజనుల సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం గిరిజనుల భూములను తీసుకునేందుకు చేస్తున్న ప్రయత్నం సరికాదన్నారు. మా ఓట్ల ద్వారా అధికారంలోకి వచ్చి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గిరిజన బంధుతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయో చెప్పాలన్నారు. గిరిజనులకు మంత్రివర్గంలో చోటు కల్పించలేదన్నారు. కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ఇతరులపై నెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని అందరూ గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి తన అల్లుడి కోసం గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం మాజీ సర్పంచ్ భూక్యా శంకర్‌నాయక్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు అజ్మీరా తిరుపతినాయక్ మాట్లాడుతూ, కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత సోదరుడు, అల్లుడికి ఫార్మా కంపెనీ ఏర్పాటుకు గిరిజనుల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్వయంగా కలెక్టర్ దాడి జరగలేదని చెప్పుండగా గిరిజనులపై కేసులు పెట్టి అరెస్ట్ చేయడం సరికాదన్నారు. గిరిజనులతోపాటు ఇతర సామాజికవర్గాలను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీ కుటుంబం కోసం ఇంకా ఎంతమందిని జైలుకు పంపుతారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో భూక్యా సీత్యానాయక్, భూక్యా దేవిలాల్, ముడావత్ బాపురావునాయక్, బానోతు గణేశ్‌నాయక్, బొడావత్ శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.

'కష్టపడితేనే ఉన్నత శిఖరాలకు..'

నామాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కోడం విష్ణు

ముస్తాబాద్, నవంబర్ 14 : విద్యార్థులు కష్టపడి చదువుతేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని వ్యాపారవేత్త కోడం విష్ణు విద్యార్థులకు పిలుపునిచ్చారు. మండలంలోని నామాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి 40 మంది విద్యార్థులకు రూ.36 వేల విలువైన స్టడీ కుర్చీలను గురువారం అందించారు. ఈ సందర్భంగా విష్ణును విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ ఏఎంసీ చైర్మన్ నారాయణ, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు హనుమంతరెడ్డి. లక్ష్మి, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు. అలాగే, నామాపూర్ గ్రామానికి చెందిన కొమురయ్య విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీకార్డులు అందించారు.

పొన్నసేవలో ఊరేగిన స్వామివారు

పొన్నసేవతో పురవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

వేములవాడ టౌన్, నవంబర్ 14 : కార్తీకమాసం వైకుంఠ చతుర్థశి సందర్భంగా గురువారం వేములవాడ రాజన్న ఆలయంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పొన్నసేవలో ఉంచి పురవీధులగుండా ఊరేగించారు. ఆలయంలో శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని, శ్రీ లక్ష్మీసమేత అనంతపద్మనాభ స్వామివారిని పల్లకీ సేవలో అందంగా అలంకరించబడిన ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల జయజయధ్వానాల మధ్య, వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య పురవీధుల్లో ఊరేగించారు. ఇక్కడ అధికారులు, వేదపండితులు,అర్చకులు,భక్తులు పాల్గొన్నారు.

కార్తీకమాసం సందర్భంగా రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై ఆలయ ఏఈవో శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలన చేశారు. భక్తులు వెలిగించిన దీపాలతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలుగొందింది.

శ్రీరాజేశ్వర చారిటబుల్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలోని ఆవరణలో కార్తీకమాసం సందర్భంగా వారం రోజులుగా నిర్వహిస్తున్న సహస్రదీపోత్సవం కార్యక్రమంలో సాయంత్రం భాగవత సప్తాహం ముగిసింది. భాగవత సప్తాహం చేసిన రఘురామశర్మను విశ్వహిందూ పరిషత్ నాయకులు మధు రాధాకిషన్ ఘనంగా సన్మానించారు. నేడు శుక్రవారం శివకల్యాణం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు రాగంపేట హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో వేదాంతం చంద్రశేఖర్, చిదానందం, భక్తులు పాల్గొన్నారు.

కార్తీకమాసం గురువారం సందర్భంగా రాజన్న ఆలయం ముందు భాగంలో భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీకదీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయంలో శివనామస్మరణచేస్తూ దీపాలు వెలిగించుకున్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

గంభీరావుపేట: జెండాను ఆవిష్కరిస్తున్న కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 14: సిరిసిల్లలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక కేడీసీసీబీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ చిక్కాల రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సెస్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, అంజిరెడ్డి, నారాయణరావు, కొట్టెపల్లి సుధాకర్, రవీందర్‌రెడ్డి, సెస్ ఏఏవో, జేఏవోలు పీ రాజేందర్, శ్రీదేవి, ఉమాదేవి, నీరజ, జ్యోతి రెడ్డి, ప్రశాంత్, తదితరులున్నారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సహకార వ్యవస్థ

గంభీరావుపేట, నవంబర్ 14: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా భారత దేశ మొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సహకార వ్యవస్థను ఏర్పాటు చేశారని, వారి జయంతిని పురస్కరించుకుని 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గురువారం ఏర్పాటు చేసుకున్న సహకార వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొండూరి హాజరయ్యారు. సంఘ ఆవరణలో సహకార జెండాను ఆవిష్కరించి కొండూరి మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతి పిత ఆలోచన మేరకు జవహర్‌లాల్ నెహ్రూ అమలు చేసిన సహకార వ్యవస్థ ప్రగతిని తెలుసుకునేందుకు నవంబర్ 14 నుంచి వారోత్సవాలు న